సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



సోమశిలలో 9.577 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 9.577 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1,370 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు


24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.71,,250
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,364
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,555
నవర (8 గ్రాములు)	రూ.52,440

వాతావరణం
గరిష్టం/కనిష్టం 39.0 /26.0
మంగళవారం గాలిలో తేమ 64 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. బుధవారం ఎండతీవ్రత స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.



న్యూస్‌రీల్

అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలకుల నియామకం


మల్లు సుధాకర్‌రెడ్డి


చిల్లకూరు సుధీర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన చిల్లకూరు సుధీర్‌రెడ్డిని కావలి అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడిగా, ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన మల్లు సుధాకర్‌రెడ్డిని నెల్లూరు రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడిగా నియమించారు.

ఎస్పీ బదిలీ


ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా నెల్లూరు ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి బదిలీ అయ్యారు. ఏఎస్పీ సీహెచ్ సౌజన్యకు బాధ్యతలను అప్పగించి తిరుమలేశ్వరరెడ్డి తన విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. జిల్లా ఎస్పీగా తిరుమలేశ్వరరెడ్డి గతేడాది ఏప్రిల్ 12వ తేదీన బాధ్యతలు స్వీకరించారు.

ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోళ్లు



నెల్లూరు(పొగతోట): రైతులు పండించిన ధాన్యాన్ని రైతుభరోసా కేంద్రాల(ఆర్‌బీకేల) ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల సంస్థ డీఎం లక్ష్మీనరసింహారావు, వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి, డీఎస్‌ఓ వెంకటరమణ తెలిపారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి మంగళవారం నెల్లూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా పంట కోతలు జరుగుతున్నాయని, ఇప్పటి వరకు 50 శాతానికి పైగా కోతలు పూర్తయ్యాయని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని, రైతులు నష్టపోకుండా ధాన్యానికి మంచి ధరలు వచ్చేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఆర్‌బీకేల్లో పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు.

నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు!



నెల్లూరు నెక్లెస్ రోడ్డు నిర్మాణంలో అవినీతికి పాల్పడిన మాజీ మంత్రి నారాయణ

ఎన్నికల సమయంలో హామీలను గుప్పించడం.. అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం టీడీపీ నేతలకు అలవాటుగా మారింది. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి పొంగూరు నారాయణ నెల్లూరులో చేసిన అభివృద్ధి పనులను చూస్తే విషయం అర్థమవుతుంది. టీడీపీ హయాంలో నెల్లూరు నెక్లెస్ రోడ్డుకు సంబంధించి చేసిన కొద్దిపాటి పనులనే కమీషన్లకు కక్కుర్తి పడి నాసిరకంగా చేశారు. దీంతో నెలల వ్యవధిలోనే నెక్లెస్ రోడ్డు నిలువునా బీటలు వారింది. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నెక్లెస్ రోడ్డు పనులను పూర్తి చేస్తానని నారాయణ చెబుతుండడంతో నగరవాసులు విస్తుపోతున్నారు.

- టీడీపీ హయాంలో అమృత్ పథకం ద్వారా రూ.25 కోట్లు మంజూరు
- ఇరిగేషన్ శాఖ అనుమతి లేకుండా నిర్మాణం
- టీడీపీ పెద్దల భోజ్యంగా మారిన పనులు
- ఎన్నికల వేళ నారాయణ నోట మళ్లీ నెక్లెస్ రోడ్డు మాట
- గెలిస్తే పనులు పూర్తి చేస్తాననడంపై నగరవాసుల మండిపాటు


నెల్లూరు ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ సమీపంలో బీటలు వారిన నెక్లెస్ రోడ్డు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెక్లెస్ రోడ్డు నెల్లూరుకు మణిహారం అని గత టీడీపీ ప్రభుత్వంలో ఊదరగొట్టిన అప్పటి మంత్రి పొంగూరు నారాయణ ఆ పనులను నాసిరకంగా చేయడంతో నవ్వులపాలయ్యారు. మళ్లీ ఇప్పుడు ఎన్నికల వేళ టీడీపీ నెల్లూరు నగర అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయన నెక్లెస్ రోడ్డు రాగం అందుకోవడంపై నగరవాసులు మండిపడుతున్నారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ద్వారా అమృత్ పథకం నిధులతో సర్వాంగ సుందరంగా నిర్మించాల్సిన నెక్లెస్ రోడ్డు గత టీడీపీ ప్రభుత్వంలో పచ్చనేతల అవినీతి దాహానికి ప్రతీకగా నిలిచింది. దొరికిందే తడవుగా టీడీపీ నేతలు ఆ పథకం ద్వారా మంజూరైన నిధులను బొక్కేందుకు కమీషన్లు పుచ్చుకోవడంతో సదరు కాంట్రాక్టర్ చేసిన కొంతభాగం పనిని కూడా నాసిరకంగా చేసి మధ్యలోనే వదిలేశారు.

నెలల వ్యవధిలోనే రోడ్డుకు పగుళ్లు

నెల్లూరు స్వర్ణాల చెరువుకట్టపై నెక్లెస్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అప్పట్లో అమృత్ పథకం ద్వారా నిధులు మంజూరు చేసింది. ఆ పనులను నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా)కు అప్పగించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ ఆర్ఎంఎస్ కన్‌స్ట్రక్షన్ ద్వారా టెండర్ వేయగా అర్హత లేకున్నా అతనికే టెండర్ కట్టబెట్టారు. ఆ పనులను నెల్లూరుకు చెందిన సబ్‌కాంట్రాక్టర్‌కు అప్పగించిన టీడీపీ పెద్దలు ముందే కమీషన్లు పుచ్చుకున్నారు. దీంతో పనులు చేసే కాంట్రాక్టర్‌కు ముందే చేతిచమురు వదిలిపోవడంతో పనులను నాసిరకంగా చేశారు. ఇరిగేషన్‌శాఖ అనుమతి లేకుండానే చెరువు కట్టపై నిర్మాణాలు చేపట్టారు. రోడ్డు వేసిన నెలల వ్యవధిలోనే పగుళ్లు వచ్చాయి. చెరువు నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన తూమును పూడ్చివేయగా నగరానికి ముంపు ఉందని స్థానికులు ఆందోళన చేసినా టీడీపీ పెద్దలు పెడచెవిన పెట్టారు.

జరిగింది ఇలా..

నెల్లూరు చెరువుకట్టపై నెక్లెస్ రోడ్డు నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా అమృత్ పథకంలో రూ.25,84,90,268 నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో చెరువు కట్టను రెండు కిలోమీటర్ల వరకు విస్తరించి వాకింగ్, సైక్లింగ్ ట్రాక్, ఫుడ్ కోర్టులు, చిన్న పార్కులు ఏర్పాటు చేసేలా అంచనాలు సిద్ధం చేసి టెండర్లు పిలిచారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్ఎంఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీకి 4.67 శాతం ఎక్సెస్‌తో పనులు దక్కాయి. ఆ సంస్థ నెల్లూరుకు చెందిన టీడీపీ పెద్దల అస్మదీయుడిగా ఉన్న రమేష్‌నాయుడుకు సబ్ కాంట్రాక్ట్ ఇచ్చేసింది. ఆయా టెండర్ల విధానంలో నిబంధనలకు విరుద్ధంగా పనులు అప్పగించారు. వాస్తవంగా ఆ కంపెనీకి అర్హత లేదు. సదరు కంపెనీ పేరుతో హైదరాబాద్‌లోని హెచ్ఆర్‌డీసీసీలో రూ.44.23 కోట్లతో పనులు చేశారు. ఈ ప్రాజెక్టును మాత్రం అమృత్ పథకం టెండర్లలో చూపించకుండా సదరు కాంట్రాక్టర్ మోసం చేశాడు. ఆ టెండర్లలో హైదరాబాద్‌లో జరిగే ప్రాజెక్టును చూపించి ఉంటే బిడ్ సామర్థ్యం లేక అర్హత కోల్పోయేది. కానీ మోసం చేసి టెండర్ దక్కించుకున్నాడు. దాంతో పాటు నెల్లూరు చెరువు కట్ట అభివృద్ధి కోసం నీరు–చెట్టు పథకం ద్వారా రూ.1.7 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆర్‌కేఎస్ సంస్థ కాంట్రాక్టర్ ఆ పనులు చేజిక్కించుకుని పూర్తి చేశాడు. ఆ పనికి సంబంధించిన రికార్డులు పూర్తి చేసి బిల్లుల కోసం ఇరిగేషన్ శాఖకు పంపారు. అదే పనిని మళ్లీ అమృత్ నిధులతో చేపట్టే నెక్లెస్ రోడ్డు నిర్మాణంలో చూపినట్లు సమాచారం. ఆయా పనులు అత్యంత నాసిరకంగా చేయడంతో స్థానికుల నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. నిర్మాణాలు పూర్తికాక ముందే పగుళ్లు రావడం, చెరువు మట్టినే కట్టకు వాడడంతో కట్టకు పగుళ్లు ఏర్పడ్డాయి. మొత్తమ్మీద టీడీపీ హయాంలో దాదాపు రూ.7 కోట్ల మేర పనులు చేసినట్లు రికార్డ్ చేశారు. కానీ నుడా ఇంజినీరింగ్ అధికారులు ఆ పనులను పరిశీలించి దాదాపు రూ.5.5 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తయినట్లు నిర్ధారించారు.

టెండర్ అక్రమాలపై హైకోర్టులో రిట్

- నెక్లెస్ రోడ్ టెండర్లలో అక్రమాలపై కార్తీక్‌నవీన్ అనే కాంట్రాక్టర్ హైకోర్టులో 47611–2018 నంబర్‌తో రిట్ దాఖలు చేశాడు. రిట్ స్వీకరించిన హైకోర్టు కౌంటర్ దాఖలు చేయమని అధికారులకు ఆదేశాలిచ్చింది. కానీ కౌంటర్ దాఖలు చేస్తే పనులు నిలిచిపోతాయని మాజీ మంత్రి నారాయణ రాజకీయ ఒత్తిళ్లతో వాయిదాలు వేసేలా చేశారు. అలాగే టెండర్లలో జరిగిన అక్రమాలు, ఒకే పనికి రెండు బిల్లులు చేస్తున్నారన్న ఆరోపణలతో సెంట్రల్, స్టేట్ విజిలెన్స్‌కు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. భారీగా అక్రమాలు జరిగినట్లు టీడీపీ ప్రస్తుత ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామ
- నారాయణరెడ్డి, నెల్లూరు రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అప్పట్లో అసెంబ్లీలో తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. చెరువునీరు పారుదల కోసం ఏర్పాటు చేసిన తూముతోపాటు కాలువలు కూడా పూడ్చివేయడంతో పారుదల లేకుండా పోయిందని, భవిష్యత్‌లో చెరువు నిండితే కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని అప్పట్లో వారు ఆందోళన వ్యక్తం చేశారు.


నెక్లెస్ రోడ్డుపై పగుళ్లు ఏర్పడి కుంగిన దృశ్యం

తీరని అవినీతి దాహం

రానున్న ఎన్నికల నేపథ్యంలో టీడీపీ నెల్లూరు నగర అభ్యర్థిగా పోటీ చేస్తున్న పొంగూరు నారాయణ తాను గెలిస్తే నెక్లెస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తానని చెప్పడంపై నగరవాసులు మండిపడుతున్నారు. టీడీపీ నేతల అవినీతి దాహం తీరలేదని విమర్శిస్తున్నారు. కేవలం కమీషన్లకు కక్కుర్తి పడి నెక్లెస్ రోడ్డు పనులను పూర్తి చేయలేదని ఆరోపిస్తున్నారు

నెల్లూరు ప్రజల శ్రేయస్సే లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి


వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తామని, రానున్న రోజుల్లో ప్రజలు ఆశ్చర్యపోయేలా అభివృద్ధి చేస్తామని వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి తెలిపారు. నగరంలోని 6వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్, ముఖ్యనేతలతో కలిసి మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ తాను ఇక్కడే పుట్టి పెరిగానని, తాను ఎక్కడున్నా నెల్లూరు బిడ్డనేనని చెప్పుకోడానికి గర్వపడతానన్నారు. తాను ఎల్లవేళలా ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండి నెల్లూరు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. టీడీపీ నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ విద్యతో వ్యాపారం చేస్తున్నారని, ఆయన 2019 ఎన్నికల తర్వాత మళ్లీ ఈ ప్రాంత ప్రజలకు 2024 ఎన్నికల కోసం వచ్చారని తెలిపారు. ప్రజలు ఆయనకు ఓటేస్తే 2029లో మళ్లీ ప్రజల ముందుకువస్తాడని స్పష్టం చేశారు. ప్రతిపక్ష టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాదిరిగా తాను అసత్యాలు చెప్పనని, ఈ ప్రాంత ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబు, లోకేశ్ ఓడిపోయిన తరువాత రాజకీయాల నుంచి రిటైర్ అయి, తమ వ్యాపారాలు చూసుకోవచ్చని, టీడీపీని బీజేపీలో కలిపేసి రెస్ట్ తీసుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం టీడీపీలో ఉన్నవారంతా ఒరిజినల్ కాదని, అంతా బయట నుంచి వచ్చిన వారేనని అన్నారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, కె.కృష్ణారెడ్డి అందరూ వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచి పసుపు జెండా మోస్తున్నారని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నెల్లూరులో రూ.5,400 కోట్లతో అభివృద్ధి చేశానని చెబుతున్న ఆయన తన జేబులో ఎంత వేసుకున్నారో చెప్పాలన్నారు. నెల్లూరును గ్రీన్ సిటీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీగా తనను, నెల్లూరు నగర ఎమ్మెల్యేగా ఖలీల్‌అహ్మద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకుముందు ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ శెట్టిగుంట రోడ్డు అభివృద్ధి వైఎస్సార్‌సీపీ హయాంలోనే జరిగిందని, ప్రతి ఇంటికి ఏదో ఒక రూపంలో సంక్షేమ పథకం అందిందని తెలిపారు. విజయసాయిరెడ్డి నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా రావడం నెల్లూరు ప్రజల అదృష్టమన్నారు. ఎంపీగా విజయసాయిరెడ్డిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 6వ డివిజన్ కార్పొరేటర్ మస్తానమ్మ, డివిజన్ కన్వీనర్ మద్దినేని శ్రీధర్, 8వ డివిజన్ కార్పొరేటర్ కామాక్షి వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో 869 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం 869 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 1,021 పొగాకు బేళ్లు రాగా వాటిలో 869 విక్రయించామన్నారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 1,09,055 కిలోల పొగాకును విక్రయించగా.. రూ.2,48,45,397 వ్యాపారం జరిగింది. గరిష్ట ధర కిలో ఒక్కంటికి రూ.232 కాగా కనిష్ట ధర రూ.220 లభించింది. సగటు ధర రూ.22.82గా నమోదైంది. వేలంలో 18 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.


పండుటాకులపై పచ్చ ప్రతాపం

'అవసాన దశలో ఉన్నాం.. వయోభారంతో నడవలేని పరిస్థితి మాది.. కంటి చూపు మందగించి ఎటూ పోలేక ఇంటి పట్టునే ఉంటున్నాం.. పింఛన్ డబ్బులే మాకు జీవనాధారం.. ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయాన్నే వలంటీర్లు మా ఇంటి తలుపు తట్టి పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. జగన్ మా బిడ్డల కన్నా ఎంతో ఆప్యాయంగా చూస్తుంటే, దానిని చూసి ఓర్వలేని చంద్రబాబు తన స్వార్థ రాజకీయాల కోసం మాపై పగబట్టాడు. మేము పింఛన్ కోసం క్యూలో నిలబడి సొమ్మసిల్లి పడిపోవాలా..' అంటూ పింఛన్‌దారులు మండిపడుతున్నారు. చంద్రబాబు, టీడీపీ అనుబంధ సంస్థలు కలిసి తమకు పింఛన్ అందకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

- టీడీపీ కుతంత్రంతో ఇంటి వద్ద అందని పింఛన్లు
- పింఛన్ల పంపిణీకి దూరమైన వలంటీర్లు
- నేటి నుంచి సచివాలయాల వద్ద పంపిణీ
- మండుటెండలో నిరీక్షించే పరిస్థితి



గత టీడీపీ ప్రభుత్వంలో దుత్తలూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద పింఛన్ తీసుకునేందుకు పడిగాపులు కాస్తున్న వృద్ధులు, దివ్యాంగులు (ఫైల్)

ఎండలకు ఏమైపోతామో..




ప్రతి నెలా ఒకటో తేదీన పొద్దుపొడవక ముందే వలంటీరు ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. ఈ నెల పింఛన్ డబ్బులు ఇవ్వకపోవడంతో వలంటీర్‌ను అడిగాను. పింఛన్ సచివాలయానికి వెళ్లి తెచ్చుకోవాలని చెప్పాడు. చంద్రబాబు దిగిపోయి సీఎంగా జగన్ వచ్చాక మాకు ఈ బాధలు లేవు. మళ్లీ ఇప్పుడు మమ్మల్ని కష్టాలు పెట్టడం దేనికి.
– ఈశ్వరమ్మ, గంగపట్నం, ఇందుకూరుపేట మండలం

పింఛన్ ఎందుకు ఆపారయ్యా..




ఇతని పేరు కావడి అప్పలస్వామి. వయస్సు 78 సంవత్సరాలు. సొంతంగా ఇల్లు గానీ, సెంటు భూమి గానీ లేదు. మనుబోలు గ్రామదేవత మనుబోలమ్మ ఆలయం వద్ద ఉంటాడు. ఆరోగ్యం కూడా అంతంత మాత్రమే. బుట్టలు అల్లుకుని దాని ద్వారా వచ్చే కొద్దిపాటి డబ్బులతోపాటు పింఛన్ డబ్బులే జీవనాధారం. రోజూ తిండికి, మందుల ఖర్చులకు నెలకు రూ.3 వేలకు పైగా డబ్బు అవసరమవుతుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెలకు రూ.3 వేల చొప్పున పింఛన్ ఇస్తుండడంతో ఆయన జీవనానికి ఇబ్బంది లేకుండా ఉండేది. అయితే చంద్రబాబు పుణ్యమా అని ఈ నెల పింఛన్ డబ్బులు ఇవ్వకపోవడంతో పింఛన్ ఎందుకు ఆపేశారోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

చంద్రబాబుకు పుట్టగతులుండవ్




ఇతని పేరు చెన్నూరు సుబ్బారెడ్డి. వయస్సు 73 సంవత్సరాలు. పొదలకూరు మండలం మొగళ్లూరు గ్రామం. భజన గురువుగా మంచిపేరున్న వ్యక్తి. అవసానదశలో ఎటూ వెళ్లలేక, కంటి చూపు మందగించి ఇంటి పట్టునే ఉంటున్నాడు. జగన్ ప్రభుత్వంలో ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారకముందే వలంటీర్ తలుపుతట్టి ఠంచన్‌గా పింఛన్ ఇచ్చేవాడు. ఇప్పుడు సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకునేందుకు సుబ్బారెడ్డి ఆందోళన చెందుతున్నారు. చంద్రబాబు వలంటీర్లను రానీయకుండా అడ్డుకున్నాడని, ఆయనకు పుట్టగతులుండవని సుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నడవలేని స్థితిలో ఉన్న ఆయన ఎండకు సచివాలయానికి వెళ్లి పింఛన్ తెచ్చుకోవాలంటే చాలా కష్టంతో కూడుకున్న పని.

మా ఉసురు తగులుతుంది



వలంటీర్లు ప్రతి నెలా మా ఇంటికే వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. ఇప్పుడు మా ఇంటికి దూరంగా ఉన్న సచివాలయానికి వెళ్లి తెచ్చుకోవాలని చెబుతున్నారు. నేను నడవలేని స్థితిలో ఉన్నాను. ఇంత దుర్మార్గం చేస్తున్న చంద్రబాబుకు ఎవరూ ఓటు వేయరు. జగనయ్య రాక ముందు టీడీపీ ప్రభుత్వంలో ఎన్నో కష్టాలు పడి పంచాయతీ కార్యాలయం వద్ద గంటలు గంటలు ఎదురుచూసి పింఛన్ డబ్బులు తీసుకునే వాళ్లం. జగనయ్య వచ్చాక ఇంటి దగ్గరే మాకు పింఛన్ ఇస్తున్నారు. మాకు పింఛన్ డబ్బులు ఇవ్వకుండా చేసిన చంద్రబాబుకు మా ఉసురు తగిలి మట్టికొట్టుకుపోతాడు.
– గోద సుబ్బమ్మ, కోవూరు

మాకు అన్యాయం చేస్తే ఏమొస్తది



వయసు అయిపోయిన వాళ్లం. నడవలేకపోతున్నాం. మాకు అన్యాయం చేస్తే చంద్రబాబుకు ఏమొస్తది. వలంటీర్లు ప్రతి నెలా మాకు ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవాళ్లు. ఇప్పుడు పింఛన్ కోసం ఎక్కడికి పోవాలి. మమ్మల్ని చంద్రబాబు అన్యాయంగా ఇబ్బంది పెడుతున్నాడు. ఈ ఎండాకాలంలో మేము సచివాలయం వద్దకు వెళ్లి నిలబడి వారు ఇచ్చేవరకు ఉండాలంటే ఎంత కష్టం. వృద్ధాప్యంలో ఉన్న మమ్మల్ని ఇబ్బంది పెట్టే చంద్రబాబుకు ప్రజలు కచ్చితంగా గుణపాఠం చెబుతారు.
– కె.కోటేశ్వరరావు, రాజుపాళెం గ్రామం, ఉలవపాడు మండలం

క్లుప్తంగా

శిక్షణకు గైర్హాజరైతే కఠిన చర్యలు

• కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(బారకాసు): 2024 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నిర్వహిస్తున్న శిక్షణకు పోలింగ్ అధికారులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ హెచ్చరించారు. మంగళవారం నెల్లూరు నగరపాలక సంస్థ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు తప్పనిసరిగా ఎన్నికల శిక్షణకు హాజరుకావాలన్నారు. శిక్షణలో ఈవీఎం మెషీన్లను తామే స్వయంగా ఆపరేట్ చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పోస్టల్ బ్యాలెట్ చాలా కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. మే 3 నుంచి 5, అలాగే 8 నుంచి 10 తేదీల మధ్య రెండు విడతల్లో హోమ్ ఓటింగ్ (ఇంటి వద్దనే ఓటు) ప్రక్రియ చేపట్టాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆర్వో, డీఎస్పీలు సమన్వయంతో ముందుగా గుర్తించాలన్నారు. అక్కడ శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 18 చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. స్వీప్ (ఓటర్లను చైతన్యపరిచే) కార్యక్రమాలను అధికంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విభిన్న ప్రతిభవంతుల కోసం ట్రై సైకిళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో ఆర్వోలు వికాస్ మర్మత్, వి ద్యాధరి, ప్రేమ్ కుమార్, మధులత, మలోల, శీనానాయక్, ఏఎస్పీ సౌజన్య, డీఆర్వో లవన్న ఇతర అధికారులు పాల్గొన్నారు.

విలేకరులూ గెటవుట్

• అవమానించిన టీడీపీ అభ్యర్థి కాకర్ల

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ ఆత్మీయ సమావేశానికి విలేకరులను ఆహ్వానించి.. తీరా అక్కడికి వెళ్లాక అవమానించి పంపించారు. వివరాలిలా ఉన్నాయి. వింజమూరు ఎస్వీ కన్వెన్షన్ హాల్లో మంగళవారం వింజమూరు, కొండాపురం, కలిగిరి మండలాలకు చెందిన ముఖ్యనేతలతో కాకర్ల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. పాత్రికేయులు తమకు కేటాయించిన సీట్లలో ఆసీనులయ్యారు. ఈ సమయంలో కాకర్ల సురేష్ మైక్ తీసుకుని విలేకరులు బయటకు వెళ్లిపోవాలంటూ అరిచి చెప్పారు. కార్యకర్తలు మీతో అవసరం లేదని హేళన చేయడంతో పిలిచి మరీ అవమానిస్తారా అంటూ పాత్రికేయులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలైంది.

రేపు వైఎస్సార్‌సీపీలో విష్ణువర్ధన్‌రెడ్డి చేరిక



విష్ణువర్ధన్‌రెడ్డి

అల్లూరు: మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం వైఎస్సార్‌సీపీలో చేరనున్నారు. ఆరోజు ఉదయం అల్లూరులోని తన నివాసం నుంచి అనుచరులతో బయలుదేరుతారు. మేమంతా సిద్ధం బస్సు యాత్ర సందర్భంగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి, నాయుడుపేట మధ్యలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడిది చేసే ప్రాంతానికి చేరుకుంటారు. జగన్ సమక్షంలో పార్టీలో చేరుతారని కాటంరెడ్డి కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేసింది.

తెగిపడిన విద్యుత్ వైరు

• దగ్ధమైన కంపచెట్లు



మంటల్లో కాలిపోతున్న కంపచెట్లు

వరికుంటపాడు: మెయిన్ లైన్ విద్యుత్ వైరు తెగిపడి కంపకర్రచెట్లు దగ్ధమైన ఘటన మంగళవారం మండలంలోని జి.కొత్తపల్లి గ్రామ సమీపంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. ఉదయగిరి మండలం గండిపాళెం విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి జి.కొత్తపల్లి గ్రామానికి విద్యుత్ సరఫరా చేసేందుకు లైన్ ఉంది. మంగళవారం మధ్యాహ్నం మెయిన్ లైన్‌కు సంబంధించిన వైరు తెగి కింద పడింది. కంపచెట్లకు మంటలు వ్యాపించి దగ్ధమయ్యాయి. అదే సమయంలో అటువైపు వెళ్తున్న ఆటోపై నిప్పురవ్వలు పడ్డాయి. దీంతో వాహనంపైన పట్ట, అందులోని తినుబండారాలు పూర్తిగా కాలిపోయాయి. స్థానికులు ఆటోపై నీళ్లు చల్లారు. ఉదయగిరి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. సిబ్బంది మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ తీగ తెగిన సమయంలో జనసంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

అన్నదాతకు అండగా..

జిల్లాలో సుమారు 3 లక్షల ఎకరాల్లో రబీ సాగు

• 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా
• ముమ్మరంగా కొనుగోళ్లు
• ప్రభుత్వ ఆదేశాలతో పర్యవేక్షిస్తున్న అధికారులు



కోవూరు మండలంలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో రబీ వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. సగానికి పైగా పూర్తయ్యాయి. ఈసారి సీజన్ కొంత ఆలస్యమైంది. అయినా ప్రభుత్వ సహకారంతో అధికంగానే సాగు జరిగింది. నాట్లు మొదలైనప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు వ్యవసాయ శాఖ రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోంది. కొనుగోళ్లకు సంబంధించి దళారుల బారిన పడకుండా చూడాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.

జిల్లాలో..

రబీలో సుమారు 3 లక్షల ఎకరాలకు పైగా వివిధ రకాలను సాగు చేసినట్లు అధికారుల అంచనా. ప్రధానంగా కేఎన్ఎం–1638, కేఎన్ఎం–733, ఆర్ఎన్ఆర్ 15048, బీపీటీ–5204 వంటి రకాలు అధికంగా వేశారు. మొత్తంగా సుమారు 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని చెబుతున్నారు. రైతులు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేసి, వారికి దన్నుగా నిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా జిల్లా వ్యవసాయ శాఖ యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంది. ప్రస్తుతం అధికారులు ఎన్నికల ప్రక్రియలో బిజీగా ఉన్నా రైతులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారించారు.

ఇలా..

మద్దతు ధర విషయంలో రైతులు నష్టపోకుండా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో క్షేత్రస్థాయిలో జరుగుతున్న కొనుగోళ్లను వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. పల్లెలకు వెళ్లి మద్దతు ధరకు విక్రయిస్తున్నారా?, దళారుల మోసాలకు గురవుతున్నారా? అని ఆరా తీస్తున్నారు. ధరల విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా ఉండడంతో ప్రైవేట్ వ్యక్తులు ధరలు తగ్గించి కొనుగోలు చేసేందుకు సాహసించడం లేదు. ఉన్నతాధికారులు కూడా నిత్యం సమావేశాలు పెట్టి కొనుగోళ్ల గురించి ఆరా తీస్తుండడంతో రైతులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మూడు విధాలుగా..

ప్రత్యేక చర్యల కారణంగా రైతులకు అధిక ధరలు లభిస్తున్నాయి. మిగిలిన ధాన్యం కొనుగోలుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. రెండు వేల మెట్రిక్ టన్నులకు పైగా దిగుబడి వచ్చే ప్రాంతాలను ఏ కేటగిరీలోకి చేర్చారు. అక్కడే కొనుగోలు చేస్తారు. వెయ్యి నుంచి రెండు వేల మెట్రిక్ టన్నుల మధ్య దిగుబడి వచ్చే రెండు ప్రాంతాలను బీ కేటగిరీగా చేర్చి ఒకచోట కొనుగోలు చేయడం జరుగుతుంది. అదే విధంగా వెయ్యి మెట్రిక్ టన్నులకు తక్కువగా దిగుబడి వచ్చే మూడు ఊర్లను సీ కేటగిరీలో చేర్చి కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. రైతు భరోసా కేంద్రాల వద్ద పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచారు.

ఆ పంటల విషయంలో..

ప్రధానంగా ఈ రబీ సీజన్‌లో వరితోపాటు శనగలు, వేరుశనగ, జొన్న పంటలను జిల్లాలో సాగు చేస్తుంటారు. కాగా ప్రస్తుతం జేజీ–11, కేఏకే–2 వేరుశనగ టీఏజీ–24 వంటి రకాలు అధికంగా వేశారు. వీటితోపాటు జొన్న కూడా సాగులో ఉంది. ఈ పంటలకు సంబంధించి మద్దతు ధర విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఎక్కువ ధరకే విక్రయాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆదేశాలతో వ్యవసాయ, పౌరసరఫరాలు, మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పని చేస్తున్నాయి.



కొనుగోళ్ల గురించి ఆరా తీస్తున్న అధికారులు

ఎక్కడా ఇబ్బందుల్లేవు



రబీ సీజన్‌లో వరి, ఇతర పంటల దిగుబడులకు సంబంధించి విక్రయాల్లో రైతులకు ఎక్కడా ఇబ్బందుల్లేకుండా చేస్తున్నాం. ఎప్పటికప్పుడు అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటున్నాం. ఇప్పటికే రైతులు అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నట్లు గుర్తించాం. – సత్యవాణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి

పేదలపై చంద్రబాబు కక్ష సాధింపు

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



పోలంరాజుగుంటలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేయనీయకుండా చేసి చంద్రబాబు నాయుడు పేదలపై కక్ష సాధింపులకు పాల్పడ్డాడని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. మండలంలోని పోలంరాజుగుంట, దమ్మాయపాళెం, నారికేళపల్లి పంచాయతీల్లో మంగళవారం మంత్రి ప్రచారం చేశారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ప్రతినెలా ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా పెన్షన్లు అందుకోవడం చంద్రబాబుకు ఇష్టం లేదని విమర్శించారు. నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేయించి, వలంటీర్ల సేవలు నిలిపివేయించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందే బాబు నైజం బయటపడిందన్నారు. గతంలో వందల కొద్దీ హామీలిచ్చి మోసం చేసిన చంద్రబాబు ప్రసంగాలను కాకాణి ప్రజలకు వినిపించారు.

ధాన్యానికి రికార్డు స్థాయిలో ధర

గతంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మిల్లర్లు, దళారుల నుంచి రూ.50 కోట్లు ముడుపులు తీసుకొని మద్దతు ధర దక్కనీయకుండా రైతులను ఇబ్బంది పెట్టారని కాకాణి ధ్వజమెత్తారు. ఇప్పుడు ఎక్కడికైనా ధాన్యం రవాణా చేసే వెసులుబాటు కల్పించామని, అందువల్లే పుట్టి ధర రూ.23,000 నుంచి రూ.24,000 వరకు ఉందన్నారు. సోమిరెడ్డి ఓట్లు వేయించుకుని మళ్లీ కనిపించకుండా పోతాడని ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన కాకాణికి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ గండవరం సుగుణ, సర్పంచ్‌లు దువ్వూరు హరికారెడ్డి, సన్నారెడ్డి హారతి, హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యుడు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు దువ్వూరు సుబ్బరామరెడ్డి, దువ్వూరు కోదండరామరెడ్డి, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, వసంతకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూరల్ నియోజకవర్గంపై స్పెషల్ ఫోకస్

• వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి



పార్టీలో చేరిన యువకులతో ఆదాల

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంపై స్పెషల్ ఫోకస్ పెట్టి అభివృద్ధి చేస్తామని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 27వ డివిజన్‌లోని రిత్విక్ లేఅవుట్‌లో సీనియర్ సిటిజన్స్‌తో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, 27వ డివిజన్ ఇన్‌చార్జి సన్నపురెడ్డి వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో ఆదాల మాట్లాడుతూ తాను ఎక్కడ గెలిచినా ఆ ప్రాంత అభివృద్ధి మాత్రమే కోరుకుంటానన్నారు. రూరల్ ఇన్‌చార్జిగా తొమ్మిది నెలల్లోనే రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు చేశానని పేర్కొన్నారు. రూరల్లో తన రాజకీయ జీవితంలో ఎవరితో గొడవలకు దిగలేదన్నారు. ఎవరినీ ఇబ్బంది పెట్టడం, వివాదాలను ప్రోత్సహించిన దాఖలాల్లేవని లేదని స్పష్టం చేశారు. పెంచలరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 27వ డివిజన్‌కు చెందిన 50 మంది యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయకుమార్‌రెడ్డి, నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, సుధీర్‌కుమార్‌రెడ్డి, స్వర్ణా వెంకయ్య, కోటేశ్వరరెడ్డి, గౌరి, రామశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో మహిళకు రెండేళ్ల జైలు

నెల్లూరు(లీగల్): ఇంట్లోకి ప్రవేశించి వృద్ధురాలిని బెదిరించి నగలు దోపిడీ చేసినట్లుగా నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో నెల్లూరు ఉడ్‌హౌస్ సంగం ప్రాంతానికి చెందిన పేరివేటి లక్ష్మి అనే మహిళకు రెండేళ్ల జైలుశిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ నెల్లూరు రెండో అదనపు మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి శారదారెడ్డి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. నెల్లూరు నగరంలోని ప్రకాష్‌నగర్ ప్రాంతానికి చెందిన నూనె రాజారత్నం అనే వృద్ధురాలు బంధువులతో నివాసం ఉంటోంది. గతేడాది ఆగస్టు 7వ తేదీన ఉదయం 10.50 గంటల ప్రాంతంలో ఆమెను ఇంట్లో ఉంచి కుటుంబసభ్యులు ఆంజనేయస్వామి గుడికి వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో పని చేసే లక్ష్మి ముఖానికి గుడ్డ కట్టుకుని వచ్చి వృద్ధురాలిని బెదిరించి 98 గ్రాముల బంగారాన్ని దోచుకెళ్లింది. గుడి నుంచి ఇంటికి వచ్చిన కోడలు గాయత్రి విషయం తెలుసుకుని లక్ష్మిని అడగ్గా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం లక్ష్మిపై కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైమేరకు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ కల్పన కేసు వాదించారు.

ఆత్మకూరు అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టో

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



మాట్లాడుతున్న విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: 'నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టోని రూపొందించాం. ప్రభుత్వ, ఏడీఎఫ్ నిధులతో పనులు చేసేలా ప్రణాళిక తయారు చేశాం' అని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి నియోజకవర్గ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులతో స్థానిక శ్రీధర్ గార్డెన్స్‌లో మంగళవారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో ఎమ్మెల్యే మాట్లాడారు. మేకపాటి కుటుంబానికి ప్రజలు అండగా ఉన్నారని, వారిని జీవితాంతం గుర్తుంచుకుంటామన్నారు. జిల్లాలో ఎక్కడాలేని విధంగా 58 దేవాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయన్నారు. ఆత్మకూరుపాటు అన్ని మండలాల్లో శ్మశానవాటికల నిర్మాణం, మండల కేంద్రాల్లో సెంట్రల్ లైటింగ్, డివైడర్ల ఏర్పాటు, రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం తదితరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయించనున్నట్లు తెలిపారు. అంతర్గత రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. భారీ పరిశ్రమ ఏర్పాటు, మెగా జాబ్‌మేళా ద్వారా ఐదువేల మందికి వారి అర్హతను బట్టి ఉద్యోగాలు లభించేలా చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలోని జూనియర్, సీనియర్, సివిల్ జడ్జి కోర్టుల భవన నిర్మాణాలతోపాటు అసంపూర్తిగా ఉన్న ఆర్డీఓ కార్యాలయ పనులు చేపట్టేందుకు మేనిఫెస్టోలో పొందుపరిచినట్లు ఆయన వివరించారు.

నేటి నుంచి సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ

నెల్లూరు(పొగతోట): గ్రామ, వార్డు సచివాలయాల్లో బుధవారం నుంచి పింఛన్లను పంపిణీ చేయనున్నారు. 8వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లా వ్యాప్తంగా 3,19,961 మంది లబ్ధిదారులున్నారు. వీరికి రూ.95.77 కోట్ల నగదును అందజేస్తారు. అనారోగ్యంతో తిరగలేని వారి వద్దకు సచివాలయ ఉద్యోగులు వెళ్లి నగదు అందజేస్తారు. కాగా పెన్షన్ల పంపిణీకి ఒక్కో సచివాలయంలో 5 నుంచి 6 కౌంటర్లు ఏర్పాటు చేశారు. లబ్ధిదారులు అధికంగా ఉన్న చోట్ల 7 నుంచి 8 కౌంటర్లు పెట్టారు.

ఏడు నియోజకవర్గాలకు కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు పీసీసీ అభ్యర్థులను ప్రకటించింది. ఎస్కే ఫయాజ్ (నెల్లూరు రూరల్), ఎన్.మోహన్‌రెడ్డి (కోవూరు), పూల చంద్రశేఖర్ (సర్వేపల్లి), చిల్లకూరు వేమయ్య (గూడూరు), సోము అనిల్‌కుమార్‌రెడ్డి (ఉదయగిరి), గాడి తిలక్‌బాబు (సూళ్లూరుపేట), చేవూరు శ్రీధర్‌రెడ్డి (ఆత్మకూరు) బరిలో ఉంటారు. 30 సంవత్సరాలుగా పార్టీలో ఉంటున్నా తనకు నెల్లూరు రూరల్ లేదా గూడూరు నుంచి పోటీ చేసే అవకాశం ఇవ్వలేదని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరు పార్లమెంట్ నుంచి పీసీసీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి పోటీ చేయాలని భావించారు. అయితే తొలి జాబితాలో ఆయన పేరు లేదు.

పేదలకు సంక్షేమం జగన్‌తోనే సాధ్యం

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని సుందరగిరివారి కండ్రిగ, సోమేశ్వరపురం, జక్కేపల్లిగూడూరు, ఏబీ కండ్రిగ, నాగులవరం పంచాయతీల్లో ఎమ్మెల్యే మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే పేదల జీవితాల్లో వెలుగులు మొదలయ్యాయన్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా పేదలకు పథకాల రూపంలో ప్రభుత్వం అండగా నిలిచిందని తెలిపారు. సంక్షేమాన్ని చేరువ చేసేందుకు సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొచ్చి ప్రజా పాలనకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పేదల సంక్షేమం కోసం ఇంతగా కృషి చేసిన ప్రభుత్వం దేశంలో మరెక్కడా లేదని తెలిపారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని, కావలి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థులు అందుబాటులో ఉండరు

• వైఎస్సార్‌సీపీ ఉదయగిరి అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కొండాపురం: 'టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్ ప్రజలకు అందుబాటులో ఉండరు. ఎన్నికలయ్యాక విదేశాలకు వెళ్లిపోతారు. తామే ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తాం' అని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని గానుగపెంట, పెరికపాళెం, జంగాలపల్లి, శెట్టిపాళెం గ్రామాల్లో విజయ సంకల్పయాత్రను ఆయన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో బీసీలకు అగ్రస్థానం కల్పించినట్లు చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీలు జట్టు కట్టి వస్తున్నాయని, వారు ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేవన్నారు. వలంటీర్లను పింఛన్ల పంపిణీకి దూరం చేసి పేదలను చంద్రబాబు ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి తాము ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చిమిలి రవీంద్ర, గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కర్తం శ్రీనివాసులురెడ్డి, సచివాలయ కన్వీనరు యారవ నరసింహారావు, గానుగపెంట, శెట్టిపాళెం సర్పంచ్‌లు మంచాల మల్లికార్జున, దంపూరి రాజశేఖర్, ఎంపీటీసీ బంకా మాల్యాద్రి, నాయకులు చిమిలి రాజేంద్రప్రసాద్, దాసరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 145
లేయర్ (లైవ్) : 73
బ్రాయిలర్ చికెన్ : 256
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 282
లేయర్ చికెన్ : 125

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.70
సన్నవి	: రూ.55
పండ్లు	: రూ.22

